క్లుప్తంగా

చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసిస్తూ ధర్నా



చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

సీతానగరం: భారత అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా ఉందని దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు చీఫ్ జస్టిస్ గవాయిపై చేసిన దాడికి నిరసనగా, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నందెన్న అనుపోత్సవం



చెరువులో అనుపోత్సవం చేస్తున్న ప్రజలు

పార్వతీపురంరూరల్: మండలంలోని సంగంవలస గ్రామంలో త్రిరాత్రి నందెన్న మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం గౌరీపౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చే సిన పార్వతీసమేత పరమేశ్వరులకు భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. బుధవారం రాత్రి మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు చేసి అనుపోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు



మండల స్థాయి పోటీల్లో సత్తా చాటిన కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన మండల స్థాయి అండర్ 14, 17 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటనట్లు ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, పీడీ మురళి తెలిపారు. డి.ప్రణీత్, బి.వరుణ్,సింహా చక్రిలు పోటీల్లో రాణించి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే కబడ్డీ, ఖోఖో పోటీల్లో కూడా విద్యార్థులు రాణించారని చెప్పారు.

అవగాహన కల్పించాలి



ద్రావణాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్, తదితరులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట దిగుబడులు పెంచేందుకు రైతులకు క్షేత్ర స్థాయిలో మరింత అవగాహన కల్పించాలని ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలసలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, మండలాలకు చెందిన ఎన్‌పీఎం షాపు యజమానులకు వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు, జీవామృతాల తయారీపై బుధవారం శిక్షణిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది పొడవునా పచ్చదనం ఉండాలంటే మిశ్రమ పంటలను పండించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి రమాప్రభ, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, ట్రైనర్స్ సింహాద్రి, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

కురుపాం: విద్యార్థులకు సరఫరా చేసే ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రతాప్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు.

కఠోర దీక్షతో అయ్యప్ప పూజలు



ఎయిమ్ ఫర్‌సేవా కేంద్రం సమీపంలో అయ్యప్ప భక్తులు

సీతానగరం: మండలంలో అయ్యప్పస్వామి భక్తుల సమ్మేళనం ప్రారంభమైంది. పలుగ్రామాల్లో అక్టోబరు 3వ తేదీ నుంచి మాలలు వేసుకుని దీక్ష ప్రారంభించి సన్ని.ధాదానాలు ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని లచ్చయ్యపేట, తామరఖండి, దయానిధిపురం, పూనుబుచ్చంపేట, వెంకటాపురం, నిడగల్లు తదితర గ్రామాల్లో మాలలు వేసుకుని 18 అరటి డొప్పలతో గుడిమెట్లు నిర్మాణం చేసుకుని మెట్లపై జ్యోతులు వెలిగించి పూజలు ఘనంగా చేస్తున్నారు.



మాలాధారణలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ప్రజల్లో పెరుగుతున్న భక్తిభావం



ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను విడనాడి భక్తిభావం పెరగడం సంతృప్తి నిచ్చింది. శబరిమలై అయ్యప్ప స్వామిపై ఉన్న నమ్మకంతో దశాబ్దాల కాలంగా సేవలందిస్తున్నాను. ప్రజల్లో ఉన్న దుర్వ్యసనాలను పారదోలి సన్మార్గంలో నడిపించడానికి నా వంతు కృషి చేస్తున్నాను. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలుమండలాల్లో దీక్షలు తీసుకుంటున్న వారికి మాలధారణ చేయడం ఆనందాన్ని ఇస్తోంది. భక్తులందరితో 41 రోజుల దీక్ష చేయించి అయ్యప్ప దర్శనానికి కొండకు నా ఆధ్వర్యంలోనే వెళ్తాం.

చప్ప వెంకటరమణ, గురుస్వామి.లక్ష్మీపురం

క్లాప్ మిత్రల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న క్లాప్ మిత్రల యూనియన్ మండల అధ్యక్షుడు జె.గౌరి

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణమద్దతు నివాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బుధవారం ఆ సంఘం మండలశాఖ అధ్యక్షుడు జలమూరు గౌరి అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డివేణు, మండల కార్యదర్శి జీవీ రమణలు మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామాల్లో సేవలందిస్తున్న క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులకు బాకీ పడిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిదులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో గ్రీన్‌అంబాసిడర్లు, క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకూ రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధస్థాయిల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి అందరి సహకారాన్ని అర్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు సిల్లా పోలీసు, పి తిరుపతి, కరుణాకర్, అబ్రహం, శంకర్రావు, రాము పాల్గొన్నారు.

పక్కా ఆక్రమణ తొలగింపులో అధికారుల డ్రామా



నారాయణపురంలో ఆక్రమణ తొలగింపుపై అధికారుల సమావేశం

బలిజిపేట: పక్కాగా అది ఆక్రమణ అని తెలిసి, ఆక్రమణదారుకు నోటీసులు ఇచ్చి తొలగించేందుకు అధికారులే డ్రామాలు ఆడుతుంటే సామాన్య పౌరుడుకి న్యాయం ఎక్కడ జరుగుతుందని గ్రామస్తులు చర్చించుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ మేరకు బలిజిపేట మండలం నారాయణపురంలో కోవెల రోడ్డు పక్కనే ఉన్న స్థలంలో ఒకరు ఆక్రమించి పురిపాక వేశారు. దానిని తొలగించే విషయంలో బుధవారం ఎంపీడీఓ శ్రీవాణి, కార్యదర్శి, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఇది రెండవసారి పర్యవేక్షణ చేయడం. దీనిని తొలగించాలని గ్రామ కార్యదర్శికి సూచనలు ఇచ్చినా తొలగించకుండా కార్యదర్శి డ్రామాలు ఆడడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కార్యదర్శి వల్లే తాత్సారం జరుగుతోందని తెలిసి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు తప్ప కార్యదర్శిపై చర్యలు చేపట్టకుండా తరచూ గ్రామంలో ఈ ఆక్రమణపై సమావేశాలు ఎందుకు ఏర్పాటుచేయడమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు డ్రామాలు ఆడడమే తప్ప సామాన్య ప్రజలకు న్యాయం చేయరని ఆవేదన చెందుతున్నారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు



అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: ప్రత్యేక ఆధార్ క్యాంపులను తపాలా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సజన్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 5 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వయసుగల పిల్లలు తప్పని సరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించు కోవాలని సూచించారు. ఈనెల 10, 11 తేదీల్లో సజన్ స్కూల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అప్డేట్ చేయించుకున్న వారికి సంబంధించిన తల్లికి వందనం ఇతర స్కాలర్ షిప్‌లు సకాలంలో అందుతాయన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పిల్లల బయోమెట్రిక్ అథెంటికేషన్ నిమిత్తం ఎటువంటి రుసుము ఉండదని, మిగిలిన అప్‌డేషన్ సేవలకు తగిన రుసుం ఉంటుందని తెలియజేశారు. పేరు నమోదు, అడ్రస్ మార్పు, పుట్టిన తేదీ మార్పు, తప్పొప్పుల సవరణ, ఫోన్ నంబర్ మార్పుకు డాక్యుమెంట్స్ తప్పనిసరని తెలిపారు.

మానసికంగా దృఢంగా ఉండాలి

- కేజీబీవీ ప్రిన్సిపాల్ ఐ.కిరణ్‌కుమారి

కురుపాం: ప్రతి విద్యార్థీ మానసికంగా దృఢంగా ఉండాలని స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ ఐ.కిరణ్‌కుమారి అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కెరీర్, మానసిక జిల్లా కౌన్సిలర్ రేవెళ్ల అనంతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ..మెరుగైన ఆరోగ్యానికి సమతుల ఆహారం తప్పనిసరన్నారు. మానసిక ఒత్తిడి, భావోద్వేగ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు .

గిరిజనులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ హరిబాబు

సీతంపేట: గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.హరిబాబు అన్నారు. మండలంలోని దేవనాపురంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారున. చిన్నతనంలో పిల్లలకు వివాహం చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, ఎస్సై అమ్మన్నరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మూర శ్యామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం ఫ్రీ లీగల్ ఎయిడ్

పార్వతీపురంటౌన్: భారత రాజ్యాంగంలో 39(ఎ) ప్రకారం ప్రతి పౌరుడికి సమానంగా న్యాయం అందించడంలో భాగంగానే అత్యున్నత న్యాయస్థానాలు పేదప్రజలకోసం ఫ్రీ లీగల్ ఎయిడ్‌ను జాతీయ, రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిలో, గ్రామ స్థాయిలో, కళాశాల స్థాయిలో ఏర్పాటు చేసినట్లు పార్వతీపురంలోని వెంటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు కళాశాల పొలిటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాలలో చదువుతున్న డిగ్రీవిద్యార్థులకు ఉచిత న్యాయసహాయంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉచిత న్యాయ సహాయ సౌకర్యాన్ని కేవలం 30 శాతం మంది ప్రజలు మాత్రమే వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులకు ఫ్రీ లీగల్ ఎయిడ్ గురించి తెలియజేయడమేగాక వారి సందేహాలను పూర్తిస్థాయిలో నివృత్తి చేశారు. పేదలకు, ఎస్సీ.ఎస్టీలకు, మహిళలు, పిల్లలకు, కార్మికులు నిరుద్యోగులకు, జైల్లో ఉన్న ఖైదీలకు, ప్రకృతి విపత్తుల్లో, హింసవల్ల బాధితులకు ఉచిత న్యాయ సలహాలను అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వమే వారికి ఉచిత న్యాయవాదిని నియమించి ఎటువంటి కోర్టు ఫీజులు లేకుండా లోక్ అదాలత్ ద్వారా వారి కేసుల పరిష్కారం కూడా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది సత్యనారాయణ పాణిగ్రహి, వైస్ ప్రిన్సిపాల్ బలగ శాంతకుమారి, కళాశాల పొలిటిక్స్ అధ్యాపకులు బంకురు తిరుపతిరావురావు, ఎం.రమేష్, లైబ్రేరియన్ టి.గణేష్ కుమార్, ఎన్‌సీసీ కెప్టెన్ గుప్తా, తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టా



చప్టాపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నిలిచిన వాహనాలు

సాలూరు రూరల్: మండలంలోని కందులపథం పంచాయతీ మడతన వలస గ్రామం మధ్యలో వర్షం నీరు పారేందుకు రోడ్డుపై ఏర్పాటు చేసిన చప్టా పెద్ద పెద్ద గోతులతో ప్రమాద కరంగా మారింది.ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రతిరోజూ ఏదోఒక సమయంలో చప్టాపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వాహన చోదకులు నీటి ప్రవాహం తగ్గినంతవరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఈ చప్టా మధ్యలో పెద్ద గొయ్యి ఉండడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. బుధవారం నీటిప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఒక గంటపాటు ఎటువైపు వాహనాలు అటువైపే నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లు గోతులు కప్పేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మధ్యలో ఉన్న గోతులను పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి కోసం అగచాట్లు



జిల్లా జేసీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: పురపాలక ప్రజల దాహార్తిని, వారి కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సుమారు పదిహేను రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి చుక్క నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ నాయకులు ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, ఎస్సీ సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకర రావు తదితరులు జేసీని కలిసి పట్టణంలో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరించారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురం టౌన్: కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన విషాదకర సంఘటన గిరిజన విద్యార్థుల జీవితాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల పరిస్థితిని కేజీహెచ్‌లో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విషాదానికి ప్రధాన కారణం పాఠశాలలో రక్షిత మంచినీటి సరఫరా లేక, కలుషిత నీటిని తాగడం వల్లనే విద్యార్థినులు పచ్చకామెర్ల బారిన పడ్డారని వైద్యులు నిర్ధారించారన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన విద్యార్థుల కుటుబాలకు రూ.50లక్షలు చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పచ్చకామెర్లు ఒక రోజు, వారం రోజులు లేదా నెలరోజుల నిర్లక్ష్యం వల్ల వచ్చిన వ్యాధి కాదని కొన్నేళ్లుగా విద్యార్థినులు రక్షిత మంచినీరు వినియోగించడం లేదని స్పష్టమవుతోందన్నారు. ఐటీడీఏ పరిధిలోని 90 శాతం ఆశ్రమ పాఠశాలల్లో ఇలాంటి దుస్థితి నెలకొని ఉందన్నారు. ఏడాదిన్నరగా ఏఎన్ఎంల నియామక ఫైలు పెండింగ్‌లో ఉందన్నారు. పారిశుద్య సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దోమ తెరల పంపిణీ నిలిపివేయడం, తాగునీటి ప్లాంట్ల నిర్వహణను గాలికి వదిలేయడం వంటి నిర్లక్ష్య నిర్ణయాలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు

పాఠశాలల హెచ్ఎంలు ఐటీడీఏ ద్వారా సమస్యలపై నివేదికలు పంపినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు కేవలం కురుపాం పాఠశాలలోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని గిరిజన విద్యాసంస్థల్లో కొనసాగుతున్నాయన్నారు. అనేక సార్లు ఏఐఎస్ఎఫ్ తరఫున పోరాటాల వినతి పత్రాలు కలెక్టర్‌కు అందజేసినా, విద్యార్థుల పట్ల పూర్తిస్థాయి నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారమయ్యే దశలో ప్రభుత్వం దృష్టి సారించాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రవికుమార్, రాము, చరణ్ పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు



సీతానగరం: ఇప్పలవలసలో మంటపంపై అధిష్టించిన నందెన్న గౌరీదేవి, పార్వతీ పరమేశ్వరులు



సీతానగరం: కుమ్మరివీధిలో అర్ధనారీశ్వరుని అలంకరణలో గౌరీదేవి పరమేశ్వరులు

సీతానగరం: గౌరీపౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకుని సీతానగరం మండలంలోని గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు గ్రామాల్లో ఏర్పాడు చేసిన మంటపాల్లో శివపార్వతులు, గౌరీదేవి ప్రతిమలకు పూజలు చేశారు. మండల కేంద్రంలోని కుమ్మరి కులస్థులు ఆరాధ్య దైవంగా పూజించే శివయ్యను అర్ధనారీశ్వరుల విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అలాగే ఇప్పలవలసలో గ్రామస్తులు నందెన్న విగ్రహానికి మీదుగా పాలవెల్లిని ఏర్పాటు చేసి వివిధ రకాల పండ్లను వేలాడదీసి అఖండ జ్యోతులతో దీపారాధన చేశారు. కాశీపేట, లచ్చయ్యపేట, బగ్గందొరవలస, గెడ్డలుప్పి గుచ్చిమి తదితర గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు నిష్టాగరిష్టులైన భక్తులు నిర్వహిస్తున్నారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులు జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనం



ఎల్విన్‌పేట వద్ద జీఎస్టీపై అవగాహన ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం: తగ్గిన జీఎస్టీతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఎంఈఓ బి.చంద్రశేఖర్, గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెర్లి రవికుమార్ అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేటలో కళాశాల విద్యార్థులతో కలిసి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. జీఎస్టీ శ్లాబులు తగ్గడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అవగాహన ర్యాలీ

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధ్యాపకుడు ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వమించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొమరాడ: జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాణ్యమైన సరుకులు సరఫరా చేయండి..

సీతంపేట: గిరిజన సహకార సంస్థ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల వసతిగృహాలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక జీసీసీ గోదాంలోని సరుకుల నిల్వలు, గొాయిది, సీతంపేట డీఆర్‌డిపోలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ కృష్ణవేణి, సీడీపీఓ సిమ్మాలమ్మ, డీటీ శ్రీవిద్య, ఎస్సై వై.అమ్మన్నరావు, ఎంఈఓ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

బయటపడిన డొల్లతనం

- అసంతృప్తిని వ్యక్తం చేసిన ఆహార కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి



ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను మందలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

పాలకొండ: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించాల్సిన ఆహారంలో జరుగుతున్న డొల్లతనం ఆహార కమిషన్ చైర్మన్ పర్యటలో బయటపడింది. రేషన్ దుకాణాలలో జరుతున్న మోసాలు వెలుగుచూశాయి. ఆహార కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి మండలం, పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ దుకాణాలను బుధవారం పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా మండలంలోని సింగన్నవలస, పట్టణంలోని నక్కలపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో సరుకుల పంపిణీ సక్రమంగా లేదని.. రికార్డుల ప్రకారం పిల్లలు ఉండడం లేదని గుర్తించారు. లబ్ధిదారులకు సక్రంగా సరుకులు పంపిణీ చేయని అంగన్‌వాడీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సింగన్నవలస ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం ఇంటి వద్ద వంట చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయడం లేదని నిర్వాహకులను మందలించారు. ఇందిరానగర్ కాలనీలోని రేషన్ దుకాణం పరిశీలించి, సరుకుల్లో తేడాలు ఉండడంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.